క్లుప్తంగా

పరికరాల వితరణ



సిబ్బంది అందించిన పరికరాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్

తిరుపతి తుడా: ఎస్వీ వైద్య కళాశాల ఫార్మకాలజీ విభాగానికి చెందిన సిబ్బంది రూ.55 వేలు విలువ చేసే పరికరాలను కళాశాలకు విరాళంగా అందించారు. ఈ మేరకు సోమవారం వైద్య కళాశాలలో ప్రిన్సిపల్ రవిప్రభు చేతుల మీదుగా 12 మెటల్ లాకర్లు, అధునాతన వాటర్ కూలర్‌ను ప్రారంభించారు. అనంతరం ఆయన మట్లాడుతూ వైద్య కళాశాలకు ఫార్మకాలజీ సిబ్బంది ఉదార స్వభావంతో రూ.55 వేల విలువగల పరికరాలను అందించడం అభినందనీయమన్నారు. పీజీ వైద్య విద్యార్థులకు ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. కార్యక్రమంలో ఫార్మకాలజీ విభాగాధిపతి డక్టర్ ఆశాలత, ప్రొఫెసర్ భారతి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సునీత, డాక్టర్ కిరీటి, డాక్టర్ వెంకటేశ్వర్లు, పీజీ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఈఏపీ సెట్ ఫలితాల్లో అశ్వమేధ ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అశ్వమేధ డైరెక్టర్లు, ప్రిన్సిపల్స్

తిరుపతి ఎడ్యుకేషన్ : ఏపీఈఏపీసెట్ ఫలితాల్లో తిరుపతిలోని అశ్వమేధ విద్యాసంస్థ విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటినట్లు ఆ సంస్థ డైరెక్టర్లు అబ్దుల్ ఇశ్రత్, టీఎం.గోవర్ధన్లు తెలిపారు. ఈ ఫలితాల్లో ఇంజినీరింగ్ విభాగంలో పి.నిఖిల్ రాష్ట్రస్థాయిలో 522, ఎస్.వెంకటసాయి 737, జి.వెంకటరెడ్డి 1041, సీవీ రేవంత్ 1074, వై.సిద్ధార్థ 2088, కె.యశశ్రీ 2489, కె.సంధ్య 2565, డి.శ్రీవైష్ణవి 4551, అగ్రికల్చర్ విభాగంలో బి.డోన 3408, బి.డింపుల్ వర్షిణి 3645, డి.గాయత్రీ 3965, డి.వర్షశ్రీ 4329వ ర్యాంకులు సాధించారన్నారు. అనంతరం ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపల్స్ సుమతి, రామయ్య, అధ్యాపకులు అభినందించారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయండి

తిరుపతి అర్బన్: పార్టీ బలోపేతానికి కృషి చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి సూచించారు. సోమవారం ఆమె చిత్తూరు జిల్లా పర్యటన నిమిత్తం విచ్చేయగా రేణిగుంట ఎయిర్‌పోర్ట్‌లో పార్టీ తిరుపతి నగర అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబుతో పాటు పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెను శాలువా ఇవ్వడంతో పాటు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఎప్పటికప్పుడు తిరుపతి జిల్లా సమాచారం ఇవ్వాలని కోరారు.

ఏవీఎస్ఓకు వీడ్కోలు



ఏవీఎస్ఓ సతీష్‌ను సత్కరిస్తున్న అధికారులు

చంద్రగిరి: తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ ఏవీఎస్ఓగా విధులు నిర్వహిస్తున్న సతీష్ తన మాతృసంస్థకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా సోమవారం తోళప్పగార్డెన్స్‌లోని విజిలెన్స్ కార్యాలయంలో ఆయనకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు.

హోమ్‌స్టే నిర్వాహకుల అరెస్ట్

తిరుపతి క్రైం : స్థానిక సుభాష్‌నగర్‌లోని వారాహి హోమ్‌స్టే నిర్వాహకులు ఇద్దరిని పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. హోమ్‌స్టేలో కొందరు మహిళలతో వ్యభిచారం చేయిస్తున్నందుకు కాపులూరి రంజిత్, గంధవల మురళి అనే నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఈస్ట్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. మరో నిందితుడు కొండలరావు అలియాస్ బబ్లూ పరారైనట్లు వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

చంద్రగిరి : మండలంలోని ఎగువరెడ్డివారిపల్లిలో సోమవారం సాయంత్రం ఓ వివాహిత ఆత్మహత్యకు పాల్పడింది. వివరాలు.. చంద్రగిరికి చెందిన హర్షిణి(25)కి నవీన్ అనే ట్రాక్టర్ డ్రైవర్‌తో పదేళ్ల క్రితం వివాహమైంది. ఈ క్రమంలో నవీన్ తన భార్యకు ఫోన్ కొనేందుకు తిరుపతికి వెళ్లాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో హర్షిణి ఫ్యానుకు ఉరేసుకుంది. చుట్టుపక్కల వారు గమనించి నవీన్‌కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతురాలి మేనమామ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. అయితే హర్షిణి మృతికి కారణాలు తెలియలేదు.

శ్రీవారి దర్శనానికి 12 గంటలు

తిరుమల: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లన్నీ నిండాయి. శనివారం అర్ధరాత్రి వరకు 90,802 మంది స్వామివారిని దర్శించుకోగా 35,776 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.73 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. ఎలాంటి దర్శన టికెట్లు లేని భక్తులకు 12 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

తిరుపతి నగరంలో ప్రభుత్వ స్థలాల ఆక్రమణలకు అంతే లేకుండా పోయింది. కూటమి నేతలు కనిపించిన స్థలాలను కబ్జా చేయడమే పనిగా పెట్టుకున్నారు. తాజాగా కొంక చెన్నాయిగుంటలో అక్రమ కట్టడాలు కొనసాగుతున్నాయి. అక్రమార్కులు రాత్రికి రాత్రే నిర్మాణాలు పూర్తి చేస్తున్నారు. నిన్నటి వరకు ఖాళీగా ఉన్న స్థలంలో పొద్దున్నే చూస్తే ఎంచక్కా ఇంటి నిర్మాణం అయిపోతోంది. ఆదివారం రాత్రి కూడా ఇలాగే ఓ ఇంటి నిర్మాణం చేపడితే రెవెన్యూ అధికారులు సోమవారం వెళ్లి జేసీబీ సాయంతో తొలగించడం గమనార్హం.

- బస్టాండ్‌కు సమీపంలో ఉన్న కొంక చెన్నాయిగుంటలో కొనసాగుతున్న ఆక్రమణల పర్వం
- రాత్రికి రాత్రే ఇంటి నిర్మాణాలు చేపడుతున్న కొందరు
- పచ్చనేతల అండ ఉన్నవారికి సడలింపు
- గత నెల రోజుల్లోనే పదికిపైగా ఇంటి నిర్మాణాలు
- అధికారులు తొలగించింది ఒకటి రెండు మాత్రమే

కొంక చెన్నాయిగుంటలో రాత్రికి రాత్రే చేపట్టిన అక్రమ కట్టడాలను సోమవారం తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు



కట్టేది నాలుగైదు.. కూల్చేది ఒకటీ అరా..!

తిరుపతి అర్బన్: నగరంలోని బస్టాండ్‌కు కూతవేటు దూరంలో ఉన్న కొంక చెన్నాయిగుంటలో ఆక్రమణల పర్వం కొనసాగుతూనే ఉంది. పదుల సంఖ్యలో పలువురు పచ్చనేతల సాయంతో ఇప్పటికే ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారు. ఇంకొందరు ఆ స్థలం తమ ఆధీనంలో ఉందని ప్లాట్లు వేసి అమ్ముకుంటున్నారు. మొత్తంగా నిత్యం వివాదాలకు కారణమవుతున్న కొంక చెన్నాయిగుంటను పూర్తిగా సర్వే చేస్తే ఎంత మేర ఆక్రమణలు ఉన్నాయో వెలుగులోకి వస్తాయి. ఇటీవల అధికారులు డ్రోన్ సర్వే చేసినా వివరాలు బయట పెట్టలేదు.

కొందరు అమాయకులు బలి..

తిరుపతి నగరం రోజురోజుకూ విస్తరిస్తోంది. ఉపాధి కోసం పలువురు తిరుపతి నగరానికి వలస వస్తున్నారు. దీంతో వారంతా నగరంలో నివాసం ఉండడానికి జానెడు స్థలం ఉంటే చాలు అని భావిస్తున్నారు. ఇదే క్రమంలో తక్కువ ధరలకే కొంక చెన్నయిగుంటలో ప్లాట్ ఉందంటూ కొందరు నమ్మబలుకుతున్నారు. రూ.50 లక్షల ప్లాట్‌ను కేవలం రూ.10లక్షలకే ఇస్తామని చెబుతుండడంతో కొందరు ఆ స్థలాలు ప్రభుత్వానికి చెందినవి అనే సంగతి తెలియక.. తక్కువ ధరకే ప్లాట్ వస్తోందని ఎటువంటి పత్రాలు లేకున్నా కొనుగోలు చేస్తున్నారు. తీరా నిర్మాణాలు చేపట్టే సమయంలో రెవెన్యూ అధికారులు ప్రత్యక్షం అవుతున్నారు. కట్టిన నిర్మాణాలను తొలగిస్తున్నారు. నిర్మాణాలు తొలగించకుండా ఉండాలంటే పచ్చనేతల అండ కోసం ముడుపులు చెల్లించాల్సి వస్తుంది. మొత్తంగా కొంక చెన్నాయిగుంటలో స్థలం కొనుగోలు చేసి ఇరుక్కున్న వారి కష్టాలు అన్నిఇన్నీ కాదు. ఈ విషయంపై రెవెన్యూ అధికారులు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాల్సి ఉంది. ప్రభుత్వ స్థలమైన కొంక చెన్నాయిగుంటలో ఎవరూ ప్లాట్లను కొనుగోలు చేయరాదని ప్రజలకు అవగాహన కల్పించాల్సి ఉంది. అలాగే కొనుగోలు చేస్తున్నవారు ఎలాంటి పత్రాలు లేకుండా దళారుల మాటలు నమ్మి మోసపోకుండా జాగ్రత్త పడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

బస్టాండ్ సమీపంలో ఉండడంతో..

తిరుపతి నగరంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు కేవలం 500 మీటర్ల దూరంలోనే సర్వే నంబర్ 173లో 52.56 ఎకరాల విస్తీరణంలో కొంక చెన్నాయిగుంట ఉంది. అయితే ఇందులో చాలాభాగం ఆక్రమణలకు గురైంది. ఈ నేపథ్యంలోనే ఇటీవల ఎంత మేరకు ఆ స్థలం ఆక్రమణకు గురైందో తెలుసుకోవడానికి రెవెన్యూ అధికారులు డ్రోన్ల సాయంతో సర్వే చేపట్టారు. అయితే ఇప్పటి వరకు ఆ సర్వే రిపోర్ట్‌ను బయటకు వెల్లడించలేదు. ఈ సర్వే నివేదిక స్పష్టంగా బయటకు వస్తే మాత్రం మొత్తం 52.56 ఎకరాల్లో ఎంత మిగిలి ఉందో తెలుస్తుందని అంతా చర్చించుకుంటున్నారు.

సమాచారం ఇస్తే.. తొలగిస్తాం

సమాచారం ఇస్తే ఎవరిదైనా తొలగిస్తాం. కొంక చెన్నాయిగుంట ప్రభుత్వానికి చెందినది. స్థలాలు ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేపడితే ఊరుకోం. ఎవరూ ఆ ప్రాంతంలో దళారుల మాటలు నమ్మి స్థలాలు కొనుగోలు చేసి మోసపోవద్దు. పక్కాగా పత్రాలు ఉంటే స్థలాలు కొనుగోలు చేయండి. అలాంటి స్థలాలు ఎప్పుడైనా ఇబ్బందులు తప్పవనే విషయాన్ని అంతా గుర్తించాల్సి ఉంది. నగరంలోని అన్ని చెరువులు, గుంటలపై ప్రత్యేక నిఘా పెట్టాం. ఎవరైనా ఆక్రమిస్తే వెంటనే చర్యలు చేపడుతాం. డ్రోన్ సర్వేలు చేశాం. ఆ సమాచారాన్ని త్వరలో తెలియజేస్తాం.

- కేపీ భాగ్యలక్ష్మి, తహసీల్దార్ తిరుపతి అర్బన్

నోటీస్ బోర్డు

- శ్రీతాతయ్యగుంట గంగమ్మ తల్లి మరుపొంగళ్ల నేపథ్యంలో నాలుగో మంగళవారం ఉదయం 7 గంటలకు అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణలో అమ్మవారి దర్శనం
- శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు ఆళ్వార్ తీర్థంలో స్నపన తిరుమంజనం , చక్రస్నానం. రాత్రి 7 గంటలకు శ్రీవారు ఉభయ నాంచారులతో బంగారు తిరుచ్చిలో చక్రత్తాళ్వార్‌తో మాడ వీధుల్లో ఊరేగింపు, రాత్రి 8.40 నుంచి 9.30 గంటల మధ్య ధ్వజావరోహణం
- జిల్లాలోని పలు కేంద్రాల్లో ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు, మధ్యాహ్నం 12.30 నుంచి 2 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు మూడు సెషన్లలో ఏపీ పీజీ సెట్ పరీక్షలు ప్రారంభం
- జిల్లాలోని 8 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు మెగా డీఎస్సీ పరీక్షలు
- పుదిపట్ల రామకృష్ణ మందిరంలో సాయంత్రం 6.30 గంటలకు శతావధాని ఆముదాల మురళిచే శ్రీమద్భాగవత సప్తాహం
- తిరుచానూరులోని శ్రీపద్మావతి అమ్మవారి తెప్పోత్సవాల్లో భాగంగా పుష్కరిణిలో రాత్రి 7.30 నుంచి 8.30 గంటల వరకు తెప్పపై శ్రీపద్మావతి అమ్మవారు విహారం
- అప్పలాయగుంటలో శ్రీప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహన సేవ, శ్రవణా నక్షత్రం సందర్భంగా ఉదయం 10.30 గంటలకు కల్యాణోత్సవం
- మహిళలపై అఘాయిత్యాలు, అత్యాచారాల నివారణలో కూటమి ప్రభుత్వం వైఫల్యాన్ని ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ఆధ్వర్యంలో ఉదయం 9.30 గంటలకు ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన, అంబేడ్కర్ విగ్రహానికి వినతి.
- కొర్లగుంట సెక్షన్‌లోని 33/11కేవీ రవీంద్రనగర్ సబ్‌స్టేషన్‌లో ఫీడర్లలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సంజయ్ గాంధీ కాలనీ, కొర్లగుంట, ఎర్రమిట్ట, రూరల్ మంగళం, శెట్టిపల్లి పరిపర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం
- కంచి కామకోటి పీఠాధిపతి చంద్రశేఖరేంద్ర సరస్వతి వారి జయంతి సందర్భంగా సాయంత్రం 5 గంటలకు కపిలతీర్థం నుంచి కంచిమఠం వరకు శోభాయాత్ర

ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం

తిరుపతి క్రైం : ఉద్యోగులు ఇప్పిస్తామని ఘరానా మోసానికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులపై ఈస్ట్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కడప జిల్లాకు చెందిన కావలికుంట్ల జయచంద్ర రెడ్డి, రాయచోటి వెంకట సురేష్, కావలికుంట్ల విద్యాసాగర్ రెడ్డి ముగ్గురు కలిసి ఒక సంస్థలో పనిచేస్తున్నారు. ఆ ప్రైవేట్ సంస్థ నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించమని వీరికి అప్పజెప్పింది. అయితే వీరు కూడా నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇప్పిస్తామని ఆశ కల్పించి యాజమాన్యానికి తెలియకుండా పెద్దమొత్తంలో నగదు వసూలు చేసినట్లుగా యాజమాన్యం గుర్తించింది. ఆ సంస్థ మేనేజర్ కృష్ణమోహన్ ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఈ ముగ్గురిపై చీటింగ్ కేసు నమోదు చేశారు.

తుడా వీసీగా శుభం బన్సల్



తిరుపతి తుడా: తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) వైస్ చైర్మన్‌గా జిల్లా జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌ను నియమిస్తూ సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ప్రస్తుతం తుడా ఇన్‌చార్జ్ వీసీగా కొనసాగుతున్న కమిషనర్ మౌర్య వీసీ పదవి నుంచి రిలీవ్ కానున్నారు.

అంగన్‌వాడీ బాట



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చంద్రగిరి: మూడేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలంటూ ఐసీడీఎస్ అధికారులు సోమవారం అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా స్థానిక జమండ్లవీధిలో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ నాగమణి మాట్లాడుతూ సోమవారం నుంచి 12వ తేదీ వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. 3 ఏళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రాథమిక విద్య ప్రాముఖ్యత తల్లులకు తెలియజేయడంతో పాటు, అంగన్‌వాడీల్లో అందించే విద్య పిల్లల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. 12వ తేదీన మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో సామూహిక అక్షరాభ్యాసం చేయించడం జరుగుతుందని ఆమె తెలిపారు.

ఇంత దారుణం ఏంది సామీ ?



రాఘవేంద్రనగర్ సర్కిల్ వద్ద ఉన్న గుంతల రోడ్డులో కారు ఆగిపోవడంతో నెడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గోతులకు మరమ్మతులు చేయాలంటూ ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- జీవకోనలో సీసీరోడ్లు గుంతలమయం
- రాకపోకలకు వాహనదారుల ఇబ్బందులు
- రోడ్లకు మరమ్మతులు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ నాయకుల ధర్నా

తిరుపతి మంగళం: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాసంక్షేమాన్ని, అభివృద్ధిని గాలికి వదిలేసిందనడానికి తిరుపతి జీవకోన రాజీవ్‌గాంధీ కాలనీ మార్గంలోని రాఘవేంద్రనగర్ సర్కిల్ వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్లే అందుకు నిదర్శనం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కాలంలో సీసీ రోడ్లు, మురుగు కాలువలు నిర్మించకపోవడంతో తిరుపతి నగర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాఘవేంద్రనగర్ సర్కిల్ వద్ద ఉన్న గోతుల రోడ్లలో ప్రయాణమెట్లా సాగించేదంటూ వాహనదారులు ప్రశ్నిస్తున్నారు. సీసీరోడ్లు ఎలాగో నిర్మించలేకపోతున్నారని, కనీసం గుంతల రోడ్లకైనా మరమ్మతులు చేయాలంటూ ఇప్పటికే అనేకసార్లు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులుతో పాటు స్పందనలో కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదని స్థానికులు మండిపడుతున్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుల ధర్నా..

జీవకోన మార్గంలోని రాఘవేంద్రనగర్ సర్కిల్ వద్ద ఉన్న గోతులకు మరమ్మతులు చేయాలంటూ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తలారి రాజేంద్ర, రెడ్డెప్పరెడ్డి, మురళి, రమణ, గ్రీవెన్స్ సెల్ నగర అధ్యక్షుడు మద్దాలి శేఖర్, పార్టీ నాయకులు కోటేశ్వర్(కోటి), స్వరూప్, ప్రసాద్, కిరణ్ సోమవారం ధర్నా చేశారు. గుంతలో రోడ్డులో ఆగిపోయిన కారును పార్టీ నాయకులు చేతులతో పక్కకు నెట్టారు. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఇంత దారుణమైన రోడ్లకు కనీసం మరమ్మతులు కూడా చేయలేరా ? అంటూ పాలకులపై వైఎస్సార్‌సీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే గుంతలకు మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద భారీఎత్తున ధర్నా చేపడుతామని హెచ్చరించారు.

శిలాఫలకాలపై పేర్లను సరి చేయండి



వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ నాయకులు

తిరుపతి తుడా: నగరంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్లకు శ్రీవారి భక్తుల పేర్లను గత ప్రభుత్వం పెట్టడం జరిగిందని, కొందరు ఆకతాయిలు శిలాఫలకాలపై ఉన్న అక్షరాలను తొలగించడం బాధాకరమని వైఎస్సాఆర్‌సీపీ గ్రీవెన్స్ సెల్ విభాగం నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం వారు మున్సిపల్ కమిషనర్ మౌర్యను కలసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ లీలామహల్ నుంచి కరకంబాడి వెళ్లే గోదాదేవి (ఆండాల్) మార్గం, కులశేఖర మార్గ్, హీరోహోండా షోరూమ్ వద్ద ఉన్న రాణి పరాంతక దేవి మార్గం, వంగుళూరు సీతమ్మ మార్గ్, బూపిలాటి మార్గం వద్ద గల శిలాఫలకాలపై ఉన్న పేర్లలో కొన్ని అక్షరాలు తొలగించడంతో కళా విహీనంగా కనిపిస్తున్నాయని తెలిపారు. వెంటనే తొలగించిన అక్షరాలను సరిచేసి నగర ప్రజల, భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాలని కమిషనర్‌ను కోరినట్లు వారు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ సెల్ నాయకులు పాల్గొన్నారు

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు

తిరుపతి నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 35 వినతులు వచ్చాయని కమిషనర్ మౌర్య తెలిపారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఫోన్ ద్వారా ముగ్గురు తమ సమస్యలు తెలుపగా, 32 మంది నేరుగా వచ్చి వినతులు సమర్పించారు. తమ వార్డులో సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ అనిల్ కుమార్ కోరారు. ఆయా సమస్యలను విభాగాల వారికి పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించామని అదనపు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్లు శ్యాంసుందర్, కృష్ణారెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ, సీఐటీయూ, సీపీఎం, సీపీఐ నేతలు

తిరుపతి కల్చరల్: విశాఖ ఉక్కు పరిశ్రమలో తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని ఏఐటీయూసీ, సీఐటీయూసీ నేతలు డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ నేపథ్యంలో పరిశ్రమలో కార్మికులను తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ కేంద్ర కార్మిక సంఘాలు ఏఐటీయూసీ, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.బాలసుబ్రమణ్యం, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం నగర కార్యదర్శి కె.వేణుగోపాల్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమలో అత్యంత అవాంఛనీయ పద్ధతుల్లో కాంట్రాక్టు కార్మికులు 4 వేల మందిని తొలగించడం దారుణమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ రూపాల్లో నిరసనలు, ఆందోళనల ఫలితంగా కేంద్రప్రభుత్వం రూ.11,440 కోట్లు ఆర్థిక ప్యాకేజీని ప్రకటించిందన్నారు. అయితే కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాగేసుకునే చందంగా రూ.9,346 కోట్లు వివిధ బకాయిల పేరుతో తిరిగి లాగేసుకోవడం కేంద్రప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శమన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ, జనసేన పార్టీలు నోరు మెదపకుండా కేంద్రప్రభుత్వం నయవంచన విధానాలకు వత్తాసు పలకడం సిగ్గుచేటన్నారు. సీఐటీయూ, ఏఐటీయూసీ నేతలు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆకాష్ కోచింగ్ సెంటర్‌పై చర్యలు తీసుకోవాలి

తిరుపతి ఎడ్యుకేషన్ : ఇంటర్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్ పేరుతో తిరుపతిలో ఆకాష్ ఇన్స్టిట్యూట్ కళాశాల నిర్వహిస్తోందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండి చలపతి ఆరోపించారు. సోమవారం ఎయిర్ బైపాస్ రోడ్డులోని ఆకాష్ సంస్థ ఎదుట ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోచింగ్ సెంటర్ పేరుతో ఇంటర్ తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని దుయ్యబట్టారు. ఒక్కో విద్యార్థి నుంచి రూ.3 లక్షల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. బోర్డు నిబంధనలకు విరుద్ధంగా తరగతులు నిర్వహిస్తూ ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారని విమర్శించారు. ఇంత జరుగుతున్నా సంబంధిత విద్యా శాఖ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆకాష్ సంస్థపై క్రిమినల్ కేసులు బనాయించాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తిపై దాడి

తిరుపతి క్రైమ్: త్యాగరాజు నగర్‌లో ఓ వ్యక్తిపై కొందరు దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. వెస్ట్ పోలీసు కథనం.. చిత్తూరు జిల్లా, ఎస్ఆర్‌పురం మండలం, పిల్లారి కుప్పం గ్రామానికి చెందిన గుండ్లూరు నిరంజన్‌కుమార్ ఓ రోడ్డు ప్రమాదం కేసులో తిరుపతి కోర్టుకు వచ్చాడు. ఇదే క్రమంలో వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని త్యాగరాజు నగర్లో శ్రీనివాస మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పక్కనుండగా ప్రత్యర్థులు కత్తులు, రాడ్లతో దాడి చేసి పారిపోయారు. స్థానికుల సహాయంతో హాస్పిటల్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చోరీ కేసులో నిందితుడికి జైలు

తిరుపతి లీగల్: చోరీ కేసులో తిరుపతిలోని మంగళంకు చెందిన డిదేవరాజులకు 46 రోజులు జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వాణిశ్రీ సోమవారం తీర్పు చెప్పారు. కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపిన వివరాల మేరకు.. ఈ ఏడాది మార్చి 15వ తేదీ తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ఇంట్లోకి నిందితుడు దేవరాజులు అక్రమంగా ప్రవేశించి ఓ బంగారు చైను, 2 సెల్‌ఫోన్లను అపహరించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు వెస్ట్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి నిందితుడు దేవరాజులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచారు. కేసు పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి అతనికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున ఏపీపీ సుజాత వాదనలు వినిపించారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎస్పీ ప్రసాద్

చంద్రగిరి: ప్రతి రోజు యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్ అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా సోమవారం సాయంత్రం తిరుచానూరు పోలీసు స్టేషన్ నుంచి ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీ చేపట్టారు. స్టేషన్ నుంచి సింధూ సర్కిల్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నెల రోజుల పాటు యోగాంధ్ర కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతోందన్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని పోలీసు స్టేషన్లలో కార్యక్రమం చేపట్టడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో సీఐ సునీల్ కుమార్‌తో పాటు ఎస్ఐలు సాయినాథ్ చౌదరి, జగన్నాథ రెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పాకాలలో..

పాకాల : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు, పోలీసులు సోమవారం ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి కూడలిలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యోగాతో మానసిక ప్రశాంతత, శారీరక దృఢత్వం, మంచి ఆరోగ్యం లభిస్తుందని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ రమేష్‌కుమార్, ఎస్ఐ సంజీవరాయుడు, ఎన్ఎస్ఎస్ పీఓ మాసులామణి, ఎన్ఎస్ఎస్ అధికారి ఈశ్వర్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వికసించిన బ్రహ్మకమలం



తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ తుమ్మల గుంటలో నివాసం ఉంటున్న యండ్లూరి సుబ్రమణ్యం ఇంట్లో బ్రహ్మకమలం వికసించింది. ఈ మొక్కను వారు మూడేళ్లుగా పెంచుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇంటిల్లిపాది బ్రహ్మకమలానికి పూజలు చేశారు.

అనుమానాస్పదంగా యువకుడి మృతి

తిరుపతి రూరల్ : మండలంలోని శ్రీనివాసపురంలో అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు.. ఉప్పెల దళితవాడకు చెందిన సాయి (26) ఆదివారం రాత్రి స్నేహితులతో కలిసి మద్యం తాగాడు. సోమవారం ఉదయం ఇంటి పక్క సందులో మృతదేహంగా కనిపించాడు. సాయి మృతికి కారణం మద్యం మత్తులో ఏదైనా ప్రమాదం జరిగిందా? ఆత్మహత్య చేసుకున్నాడా? ఎవరైనా హత్య చేశారా? అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. సీఐ చిన్నగోవిందు మృత దేహాన్ని తిరుపతి రుయాకు తరలించారు.